ప్రగతి పథాన రెంటచింతల


వైఎస్సార్ హెల్త్ సెంటర్


రైతు భరోసా కేంద్రం


ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్

- రెంటచింతలలో పరుగులు పెట్టిన అభివృద్ధి పనులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీలలో సీసీరోడ్లు
- నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి
- కళకళలాడుతున్న కమ్యూనిటీ హాల్స్

రెంటచింతల: రాష్ట్రంలో రెంటచింతల అనగానే వేసవికాలంలో రోళ్లు సైతం పగిలే ఎండలే గుర్తుకొస్తాయి. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో గ్రామంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. గ్రామంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు, ప్రజలకు సేవలు అందించడానికి సచివాలయాలు, పేద పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చేశారు. అలాగే మంచినీటి ఎద్దడి నివారణకు పలు కాలనీలలో బోర్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యను పరిష్కరించారు.


గ్రామ సచివాలయం

- గ్రామ స్వరాజ్యమే తన కల అని చెప్పిన జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. గతంలో ఏ సీఎం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో రెంటచింతల గ్రామంలో జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదని గ్రామస్తులు ముక్తకంఠంతో చెపుతున్నారు.


నాయుడుపేట ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్డు

ఇది కదా.. అభివృద్ధి

అభివృద్ధి ఇలా...
- రూ.4.10 కోట్లతో సీసీ రోడ్లు ఏర్పాటు
- రూ. 1.20 కోట్లతో 3 గ్రామ సచివాలయాలు
- రూ.65.40 లక్షలతో 3 రైతు భరోసా కేంద్రాలు
- రూ.41.60 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్ సెంటర్లు
- రూ. 94 లక్షలతో నాడు–నేడు పథకం కింద 4 పాఠశాలల అభివృద్ధి
- రూ.50 లక్షలతో ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ హాల్
- రూ.40 లక్షలతో క్రిస్టియన్ మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మించారు.
- రూ. 25 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయంలో, మరో రూ. 20 లక్షలతో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేయడంతో ఆయా సామాజిక వర్గాలకు ఎంతో మేలు జరిగింది. రూ. 35 లక్షలతో 10 బోర్లు, మోటార్లు, పైప్‌లైన్ ఏర్పాటు
- నేంద్రవాగు వద్ద రైతుల శ్రేయస్సు కోసం రూ.10 లక్షల వ్యయంతో ఒక కల్వర్టు ఏర్పాటు చేసి ఎంతో కాలంగా ఉన్న సమస్యను పరిష్కరించారు.

తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి...



నా చిన్నతనం నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశా. కానీ మా గ్రామంలో ఇంత తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి జరిగింది సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలోనే. నేంద్రవాగు వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టుతో రైతులు ఎంతో కాలంగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. గ్రామంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు మన కళ్లకు కనబడుతున్నాయి.

– చెన్నుబోయిన కవిడి, కౌలురైతు, గ్రామస్తుడు

గ్రామ రూపురేఖలు మారిపోయాయి...



సీఎం జగన్ సుపరిపాలనలో కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులతో మా రెంటచింతల గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా గ్రామంలో అందరికీ మేలు జరిగేలా సచివాలయాలు, కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీలలో సీసీ రోడ్లు వేయడంతో రహదారులన్నీ కళకళలాడుతున్నాయి.

– కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, గ్రామస్తుడు

అభివృద్ధికి చిరునామాగా రెంటచింతల...



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత రెంటచింతల గ్రామం అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. గ్రామంలో ఎక్కడ చూసినా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో గ్రామంలో కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు మన కళ్లకు కనిపిస్తాయి. సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– పులి ఓబుల్‌రెడ్డి, గ్రామస్తుడు

తాగునీటి సమస్యకు చెక్

రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని పలు కాలనీలలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ పేర్ల చౌడమ్మ అన్నారు. ఆదివారం గ్రామంలోని ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రూ.1.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న బోరు, మోటార్, మినీట్యాంక్‌కు ఆమె ఎంపీడీఓ పెద ప్రోలు శంకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, నాయకులతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామంలోని పలు కాలనీలలో ఏర్పడిన మంచినీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, గంజి బాలరెడ్డి తదితరులున్నారు.


ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో బోరు, మోటర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సమాజానికి మార్గ నిర్దేశకులు జర్నలిస్ట్‌లు

సీపీఐ మండల కార్యదర్శి రంగనాయకులు

రెంటచింతల: సమాజానికి మార్గ నిర్దేశకులు జర్నలిస్ట్‌లని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర మరువలేనిదని సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఎర్రబాలెం కాలనీలోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల జర్నలిస్ట్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జర్నలిస్ట్‌లు ఎంతో ఒత్తిడితో పాటు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారన్నారు. అనేక ప్రాంతాలలో జరుగుతున్న ఘటనలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపిస్తూ వారిలో చైతన్యం తీసుకురావడంలో జర్నలిస్ట్‌ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పరిపాలనలో నాలుగో స్తంభంగా మీడియా వ్యవహరిస్తుందని గుర్తుచేశారు. జర్నలిస్ట్‌ల చేతిలోని కలం ఒక గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. అనంతరం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పూజల వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ తండా సత్తార్, ఉపాధ్యక్షులుగా కుందురు అంజిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, కోశాధికారిగా గుండా జనార్ధన్‌రావులతో సీనియర్ పాత్రికేయులు నారాయణం శ్రీనివాసమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్‌లు యు.గుర్లింగరాజు, కె.శ్రీరామమూర్తి, షేక్ బాజీ, రహీం, ఎస్.వెంకటేశ్వర్లు, గాలి కోటిరెడ్డి, ఎ.మల్లికార్జునరావు, వెంకటరెడ్డి, పి.సైదారావు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో మంత్రి అంబటి ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెంలో గల బాలత్రిపురసుందరి పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో శివ కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లాయర్ సూరిబాబు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి

గురజాల : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి రమణాకాంత్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏప్రియల్ 15వ తేదీ వరకు ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటర్లకు సంబంధించిన సమస్యలు ఉంటే ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యను హెల్ప్‌డెస్క్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎవరూ అక్రమంగా మద్యం రవాణా, అధికంగా డబ్బులు తీసుకువెళ్లరాదన్నారు. అలా తీసుకువెళ్తున్నట్లు గుర్తిస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

మాచవరం: రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎవరైనా ఎన్నికల కోడ్ నియమావళిని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక అధికారులు ఆయా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను, గోడ పత్రికలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. రాజకీయ పార్టీల జెండాలను తొలగించారు. ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన రంగులు లేకుండా ఉండే విధంగా తెలుపు రంగు వేయనున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


సీఐ శరత్‌బాబు

మాచర్ల: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఏ విధమైన అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ పి.శరత్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పనిచేయాలని, ఎక్కడా రాజీ పడి ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. గతంలో సస్పెక్టెడ్, రౌడీషీట్, అల్లర్లు సృష్టించిన ప్రతి ఒక్కరి విషయంలో దృష్టి సారిస్తామన్నారు. అందరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్‌ను అనుసరించి పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులందరూ కలిసి కట్టుగా సమష్టి కృషితో పని చేయాలని గుంటూరు వ్యవసాయ మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ కోరారు. సత్తెనపల్లి మండల పరిధిలోని పెద్దమక్కెన గ్రామంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఓటమి ఖాయమని, దుష్ట చతుష్టయంకు సైతం బుద్ధి చెప్పాలన్నారు. పారదర్శకంగా సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, నియోజకవర్గంలో వేధింపులు లేని పరిపాలన అందించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మనస్పర్థలు పక్కన పెట్టి, లోపాలను సవరించుకొని నాయకులు అందరూ సమన్వయంతో ఎన్నికల్లో పనిచేయాలని సూచించారు. సీనియర్ నాయకులు వద్దుల రామకృష్ణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటప్పా రెడ్డి తదితరులతో మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉపేష్, క్రియాశీలక నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- యువ ఓటర్లే కీలకం
- 20–49 ఏళ్ల లోపు 1,83,946 ఓటర్లు
- యువత చేతిలో భవితవ్యం

గురజాల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో యువ ఓటర్లు కీలకంగా మారనున్నారు. అభ్యర్థుల భవితవ్యం తేల్చేది యువ ఓటర్లతోనేనని అర్థమవుతుంది. నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు ప్రకటించిన వివరాల మేరకు గురజాల నియోజకవర్గంలో 30–39 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 77,510 మంది ఉన్నారు. మొత్తం 2,71,272 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో ఈ వయస్సు కేటగిరీ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. తదుపరి 40–49 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. మొత్తం మీద యువ ఓటర్లు, నడి వయస్సుల వారే అధికం.

నియోజకవర్గంలోని పరిస్థితి..

గురజాల నియోజకవర్గంలో గురజాల, దాచేపల్లి , మాచవరం, పిడుగురాళ్ల మండలాలు ఉన్నాయి. పిడుగురాళ్ల మునిసిపాలిటీ కాగా గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలుగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పురుషులు 1,32,129 మంది, స్త్రీలు 1,39,101 మంది, ట్రాన్స్‌జెండర్లు 42 మంది ఓటర్లుగా ఉన్నారు. మొత్తం ఓటర్లు శాతాన్ని పరిశీలించగా 30–39 , 40–49 ఏళ్ల మధ్య వారు 1,34,717 మంది ఓటర్లు గా వున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వీరి ఓట్లు కీలకంగా మారనున్నాయి. వీరు జాగ్రత్తగా ఆలోచించి తమ భవిష్యత్తుకు తమ సంక్షేమానికి పాటుపడే వ్యక్తులను ఓట్లు వేసి ఎన్నుకోవాలని విద్యావేత్తలు, మేధావులు, సామాజిక విశ్లేషకులు తెలుపుతున్నారు.



యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి...



యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. నియోజకవర్గంలోని యువత ఓట్లు అధికంగా ఉన్నాయి. భవిష్యత్తును ఆలోచించి యువత తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాం.

– జి.వి.రమణాకాంత్ రెడ్డి, ఆర్డీవో గురజాల

క్లుప్తంగా

పెదగార్లపాడులో ఉచిత వైద్య శిబిరం

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్లు సాధారణ రోగాలతో పాటు కీళ్లు, నరాలు, స్త్రీలకు సంబంధించి పలు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాటూరి మెడికల్ కళాశాల డాక్టర్లు అనూష, అమూల్య, ప్రసాద్, ఆంజనేయులు, జయసుధ, మనీషా, నిర్వాహకులు పాస్టర్ సతీష్‌కుమార్, మందా సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి

గురజాల : తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి అన్నారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఆ ప్రాంతాలకు నిత్యం ఉదయం, సాయంత్రం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు రాకపోతే సత్వరమే మా దృష్టికి తీసుకురావాలన్నారు. సుమారు 10కి పైగా ట్యాంకర్ల ద్వారా ఉదయం, సాయంత్రం నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో ఈ సమస్య వాటిల్లిందన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

సీఐ బాలకృష్ణ

గురజాల : ఎన్నికల కమీషన్ ఎన్నికల కోడ్‌ను జారీ చేయడంతో మండలంలోని రాజకీయ నాయకులు, ప్రజలు, అల్లరిమూకలు ఎవరైనా సరే అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. ఎన్నికల నగారా మోగినందువలన ప్రజలు ఎక్కడా గుమికూడరాదని, అల్లర్లు సృష్టించరాదని, వ్యక్తిగత దూషణలు చేసుకోరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదపు ప్రయాణం



పిడుగురాళ్ల: ప్రమాదం అని తెలుసు... కానీ తప్పని తిప్పలు... రోజువారి కూలీ పనులకు వెళితేనే కుటుంబం జరిగేది... గత్యంతరం లేక ప్రమాదమని తెలిసి కూడా కూలీల ప్రయాణం ప్రమాదపు అంచున కొనసాగుతుంది. పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఆదివారం పొలంలో మిరపకాయలు కోసి మిట్ట మధ్యాహ్నం ట్రాక్టర్ ట్రక్కులో కిక్కిరిసి కుర్చొని ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన ఘటనలు తెలినప్పటికీ తప్పని తిప్పలుగా కూలీల ప్రమాణం ప్రమదపు అంచున కొనసాగుతుంది. ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు, కూలీలకు సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

కోడ్ కూసింది... బొమ్మలు తొలగించండి



పిడుగురాళ్ల రూరల్: రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్యంలో మండల పరిషత్, రెవెన్యూ, పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, విద్య, వైద్య, ప్రభుత్వ సంస్థల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డులను, బ్యానర్లను, లోగోలను, వాల్ పోస్టర్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లోని రాజకీయ పార్టీల జెండాలను తొలగించారు. రాజకీయ పార్టీ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరు సహకరించాలని తెలియజేశారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన

ముప్పాళ్ళ: పదవ తరగతి పరీక్షల నిర్వహణకుగాను విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రంను ఆదివారం ఆయన పరిశీలించారు. ముప్పాళ్ళ పరీక్ష కేంద్రంలో 11 మంది ఇన్విజిలేటర్‌లు, ఒక చీఫ్‌తో పాటు, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ విధుల్లో ఉంటారన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.

నేటి నుంచి వీర బ్రహ్మేంద్ర స్వామి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో గల శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఈ నెల 18 నుంచి 20 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 18న సుప్రభాతం, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అఖండ ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు, 19న పంచామృత అభిషేకం, హోమాలు, మంత్రపుష్పం, 20న కలశ తీర్థం, మూలమంత్ర, మండలార్చనలు తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ స్వర్ణోత్సవ వేడుకలు



బొల్లాపల్లి : మండలంలోని బండ్లమోటు గ్రామంలోని శ్రీ సీతారామస్వామి ఆలయ స్వర్ణోత్సవ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించారు. కుంభాభిషేకం, పూర్ణప్రతిష్ఠ కార్యక్రమాలను నేత్రానందంగా జరిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా గిరిబాబు, వైస్ ఎంపీపీ బడిపాటి మరియమ్మలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బండ్లమోటు మైనింగ్ సమయంలో స్వామి వారికి ప్రతి ఏటా ఉత్సవాలు జరిగేవని వారు గుర్తు చేశారు. మైనింగ్ తిరిగి పునఃప్రారంభమై ఈ ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తి గురవయ్య, ఎం.రాజయ్య, బీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



మాచర్ల రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమమే ధ్యేయంగా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మంచినీటి సమస్యనూ పరిష్కరిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ఏ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల కోసం చేయనన్ని సంక్షేమ, అభివృద్ధి పనులు ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే చేసారని, ప్రజల వద్దకే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వంటివి తీసుకొచ్చి అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత, కోటిరెడ్డి, ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పున్నారెడ్డి, హనిమిరెడ్డి, బాలిరెడ్డి, జయభారత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, తేళ్ళూరి శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

ఘనంగా కృష్ణవేణి కళాశాల వార్షికోత్సవం



నరసరావుపేట రూరల్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అవెన్ టిల్ కంపెనీ కార్యదర్శి డి.రాజశేఖరరెడ్డి, కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరిలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువతరం శక్తి, సామర్థ్యాలను సమిష్టి లక్ష్యమైన వికసిత్ భారత్ వైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పట్టభద్రులైన యువత కనీసం ఏదో ఒక వృత్తిలో నైపుణ్యం సాధించాలని సూచించారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించడంతో పాటు ఆవిష్కరణ రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపేలా భవిష్యత్తులో సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గాయనీ మౌనికా యాదవ్ ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, టి.సురేఖ, డాక్టర్ డి.మేగేశ్వరరావు, పీడీ ఈదర ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.